మరో పార్టీ స్థాపించడము వారి తప్పు వీరు, వీరి తప్పులు వారు వెల్లడించడము, అవి రచ్చకెక్కడం జరుగుతుంది. అట్లా హరిజన ప్రతినిధులు కూడా వర్తిస్తే అలాంటివారిలో వీరొకరవుతారేగాని పెద్ద ప్రమాదమేమీ జరుగదుగదా!

కనీసము వారికిగల ప్రత్యేక సమస్యలను అవగాహనము చేసుకొని, వాటికి తరుణోపాయము వూహించి పార్టీని ఒప్పించేసామర్థ్యము అసెంబ్లీలో సమర్థించి చెప్పగల కాస్త వాక్చాతుర్యమయినా ఉండాలిగదా! అలాంటివారిని ఏ పార్టీ ఎందరిని పోటీచేయిస్తుందో, రిజర్వ్డు స్థానాల్లో పోటీ చేస్తున్న హరిజన అభ్యర్థులలో ఎవరు అందుకు తగిఉండి పోటీచేస్తున్నారో పార్టీలు, అభ్యర్థులు ఒకసారి ఆత్మపరీక్ష చేసుకోమని ప్రార్థన. దీనికయినా సమయం మించింది. ఇక ఫలితాలే ఎదురుచూడవలసి వుంది.

స్కెచ్

# ద్విముఖ పోటీ – దేవుడూ

కె. రామలక్ష్మి

ఉత్తరాదినుంచి పెద్దమనిషి వచ్చాడు: సుత్తీ కొడవలి గుర్తుకోసం గొంతు చించుకోవడానికి. పెద్ద పట్నమూ చిన్నవూరూకాని ఆ టౌనులో కామ్రేడ్ కాటయ్య కాంగ్రెసు అభ్యర్థి పాపయ్యల మధ్య పోటీ-త్రిముఖపోటీకాదు, ద్విముఖపోటీనే. అందుకే ఓట్లు చీలిపోతాయి ఫరవాలేదన్న ధైర్యం కూడా లేకపోయింది కామ్రేడ్ కాటయ్యకీ, కాంగ్రెసు పాపయ్యకీకూడా. ఎవరి ప్రచారం వారు తీవ్రంగా సాగిస్తున్నారు. పాపయ్య అంత భారం ఏడుకొండలవాడిపై పెట్టి ధైర్యంగా వుందామనుకొన్నా ఉండలేకపోతున్నాడు. ఉత్తరాది పెద్దల చేతనూ లెక్చర్లిప్పించాడు, ఎద్దులబండి వూరేగింపులూ, వెంకటేశ్వర సమారాధనలూ-అన్నీ జరిపించాడు. ఈ వారం కొంచెం ప్రశాంతంగా వున్నాడు కాంగ్రెసు పాపయ్య. కాని అప్పుడే వచ్చాడు ఉత్తరాదినుంచో పెద్దమనిషి: సుత్తీ కొడవలి గుర్తుకోసం గొంతు చించుకోవడానికి. కామ్రేడ్ కాటయ్య హడావిడికి అంతులేదు. పాపయ్య నివేశనానికి ఎదురుగా పెద్దపందిరి వేయించాడు. ఎర్రజెండాలతో చక్కగా అలంకరించారు పందిరిని. ఎక్కడచూచినా రెపరెపలాడే ఎర్రజెండాలే. పాపయ్య తలుపులు మూసుకొని యింట్లోవున్నా కిటికీల్లోంచి ఎదుటి పందిరిలో జరిగే హడావిడి అంతా కళ్ళకి కడుతోంది. సాయంత్రం అవుతుంటే, పెద్ద ట్రక్కు ఒకటి వచ్చింది; లౌడ్‌స్పీకర్లూ - వ్యవహారం - అంతా దిగింది. చుట్టుపక్కల పల్లెలవాళ్ళంతా వచ్చిపడ్డట్టుంది—ఎక్కడ చూచినా జనమే, తన కాంపౌండు గేటు మూయించేశాడు పాపయ్య అయినా గోడమీద చాలామందే ఎక్కికూర్చున్నారు. అన్నితలుపులూ మూయించి పాపయ్య వెంకటేశ్వరస్వామి గదిలోకివెళ్ళి పడ్డాడు ఏమిటీ దారుణం అన్నట్లు.

'కామ్రేడ్స్' అంటూ వురిమిందో కంఠం. తనపక్కనే నుంచుని వురిమినట్లయింది పాపయ్యకి. లేచి చూశాడు. ఒక లౌడ్‌స్పీకరు, సరిగ్గా తన యింటి కిటికీకేసివుంది. అదే వురిమింది...ఆ వురుముకి గడిగోడలు పగిలిపోయినట్లయింది. పాపయ్య తనకోపాన్నంతా దేవుడిముందు వెళ్ళకక్కకుండామని మళ్ళా వెంకటేశ్వరుని గదిలోపడ్డాడు. "ఆ లౌడ్‌స్పీదరు నా యింటిపక్కపెట్టడం దారుణం, అహింసావాదినైన నన్ను హింసపాలు చేయడం! నువ్వు వూరికే యిలా చూస్తూ కూర్చుంటే ఎలా వెంకటేశ్వరా" అంటూ వాపోయాడు పాపయ్య.

"ఎవరుమటుకు ఏం చెయ్యగలరు పాపయ్యా-అది అభ్యుదయం" వెంకటేశ్వరస్వామి సమాధానం చెప్పాడు.

ఏదేదో మాట్లాడుతోంది లౌడ్‌స్పీకరులో కంఠం. స్థూలంగా సూత్రాల వివరణ అయాక యిక వ్యాపార సరళికి దిగింది. "మనం ఎప్పుడూ కూడా న్యాయాన్ని ధిక్కరించం. అవసరం

అయితే, ఆయుధాలు తీసి, ప్రజా శత్రువులను హతమార్చడానికి వెనుతీయం."

పాపయ్య దేవుడిగదిలో కాళ్ళు కలియతొక్కుకుంటున్నాడు. "ఏడుకొండలవాడా! విను వాడి ధోరణి. వింటూ ఎలా వూరుకుంటున్నావు?"

"వింటున్నానోయ్, బాగానే వింటున్నాను!" అన్నాడు స్వామి.

"ఆ మూకమీద ఏ పిడుగో ఎందుకూ పడేయవు? అలా వాగుతోందే!" పాపయ్య పళ్ళు కొరుకుతూ అడిగాడు.

"న్యాయానికి కట్టుబడేవుందాం పాపయ్యా! తప్పుచేసినవాడికి నిజం తెలిసేలా చేయాలంటే వాణ్ణి కాల్చేయాలంటే ఎలాగ చెప్పు? మనది భారతం. మహామహులందరూ దేనికి ప్రాణాలు వదిలారంటావు?" స్వామి ప్రశాంతంగా ప్రశ్నించాడు. పాపయ్య కుంగిపోయాడు. "నిజమే. మనం ఏం చేయలేం. మననికూడా వీళ్లు శిలువనో కొరతనో వేసేదాకా చూస్తూ వూరుకుందాం." తనలో తను అనుకున్న ధోరణిలో అన్నాడు పాపయ్య. వెంకటేశ్వరస్వామి నవ్వుకున్నాడు.

"దేవుని నీడచాటున దాగుకొని దారుణాలు చేసేవారి సంగతి: కార్మికులలో అంతః కలహాలు రెచ్చకొట్టటానికి, మనని ఎలాగేనా అణిచేయడానికి దేవుడే కాబోలు వారికి దిక్కు!" లౌడుస్పీకరులోంచి గొంతు చించుకుంటూంది. వళ్లు తెలియని ఆవేశంతో మూలనున్న దుడ్డుకర్ర తీసి బయలుదేరాడు పాపయ్య.

"ఆగవోయ్‌పాపయ్యా! అక్కడి అందరూవెళ్ళిపోయేదాకా ఈ గడపదాటకు"స్వామివారిఆదేశం.

"సరే...నువ్వు చెప్పినట్లే" అంటూ నిస్సహాయంగా పాపయ్య దుడ్డుకర్ర మూల పెట్టాడు. "పోనీ నా యింట్లో నేను నాకు తోచింది చేసుకోనా" అడిగాడు.

"ఓ నీయిష్టం. యిది నీయిల్లు."

కొద్దినిముషాల తరువాత పాపయ్య కాంపౌండంతా మాలపల్లె డప్పులవాళ్ళతో నిండిపోయింది. వీరాంగంలా వాయించేస్తున్నారువాళ్లు. పాపయ్య ముఖం విజయగర్వంతో విప్పారింది.

లౌడ్‌స్పీకరులో గొంతుక ఆగక తప్పలేదు. "అతన్నెలాగేనా ఆపించేలా చేయాలి" అన్నాడు వచ్చిన పెద్దమనిషి.

"మనం ఏంచెయ్యలేం, అతని సంగతి మీకు తెలియదు" నిరుత్సాహంగా అన్నాడు కామ్రేడ్ కాటయ్య.

కొద్దిక్షణాలు డప్పులు ఆగాయి. మళ్ళీ లౌడ్‌స్పీకరు ఉపన్యాసం ప్రారంభించింది. సవ్యంగా మాట్లాడుతున్నంతసేపూ ఏ గొడవాలేదు. కాని తనకి విరుద్ధంగా ఒక్కమాటవచ్చిందా-పాపయ్య డప్పులవాళ్ళకి సౌజ్ఞచేసేవాడు. చివరికి—ఆ రోజు కామ్రేడ్ కాటయ్య మీటింగు—విషాదాంతం.

ఆ సాయంత్రం, తోటమలుపులో కామ్రేడ్ కాటయ్య, కాంగ్రెసు పాపయ్యని అడిగాడు, "ఎందుకలా చేశావు? మన నిర్ణయాలు మరిచిపోయావా? యిలాంటివి చివరకి నీకే ముప్పు తెస్తాయి."

"ఏం ప్రమాదం లేదులే...నువ్వు నీ బాకా వూదుతున్నావు, నేను నా డప్పులు వాయించాను. అంతే కామ్రేడ్ అదే డెమోక్రసీ; అలాకాకుండా, నీ బాకా నువ్వూదించడానికే హక్కుండి, నే నా డప్పులు వాయించకూడదంటే, అది డిక్టేటరుషిప్-నియంతృత్వం అవుతుంది-తెలుసా?" అన్నాడు పాపయ్య.

కామ్రేడ్ కాటయ్య ఎలాగో కోపాన్ని ఉగ్గపట్టుకొని,

"అయినా మనం బావమరుదులం. ఇందులో ఎవరం పైకొచ్చినా మనిద్దరికీ లాభమే. అది మరిచిపోకు"అంటూ గబగబా వెళ్ళిపోయాడు.

---

సముద్రంలో డాల్ఫినులకీ తిమింగలాలకీ దారుణయుద్ధం జరుగుతూంది. వారిమధ్య శాంతి నెలకొల్పుదామని ఓ యెరచేప పైకివచ్చింది. దాన్నిచూచి ఒక డాల్ఫిను "పోరిపోరి ఎవరిమో ఒకరం చచ్చేనాపోతాంగాని నీలాంటి అల్పుల మధ్యవర్తిత్వం మటుకు ఒప్పుకోం" అంది. నీతి: పోరాటంలో మధ్యకివచ్చిన అల్పులు కూడా తామేమో ఘనులమని అనుకుంటూవుంటారు. —(ఈసప్ నీతికథావళి)